క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 20, దొండ 21, గుండు బీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 16, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 20, చామగడ్డ 50, మొరంగడ్డ 16, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు తార్నాక ఎన్‌ఐఎన్‌లో పుస్తకావిష్కరణ

- హాజరుకానున్న గవర్నర్

లాలాపేట: ఐసీఎంఆర్–జాతీయ పోషకాహార సంస్థ(ఎన్‌ఐఎన్), విజ్ఞాన భారతి తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో నేడు(శనివారం) 'స్వాతంత్య్ర సమరంలో విజ్ఞాన శాస్త్రం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్‌ఐఎన్ అసెంబ్లీ హాలులో ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందర్‌రాజన్ ముఖ్యతిథిగా హాజరైతున్నట్లు ఎన్‌ఐఎన్ అధికారులు శుక్రవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎనలేనివి: మంత్రి తలసాని


అగ్నిమాపక వారోత్సవాల్లో మాట్లాడుతున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: అగ్నిమాపక సిబ్బంది సేవలు వెలకట్టలేనివని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్‌లో జరిగిన అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమానికి హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాలను ఆయన పరిశీలించి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించారు.

డీఈఐ ఉత్పత్తుల ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ (డీఈఐ)కు చెందిన విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తుల ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభంకానుంది. బొల్లారంలోని శరన్‌నగర్ కాలనీలోని డీఈఐ ఐసీటీ సెంటర్‌లో ఈ ప్రదర్శనతో పాటు కొనుగోలు కూడా చేసుకోవచ్చు. ఆదివారంతో ముగియనున్న ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.

ఓయూలో జార్జిరెడ్డికి నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వవిద్యార్థి జార్జిరెడ్డి 51వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విమలక్కతో పాటు జార్జిరెడ్డి మిత్రులు, అభిమానులు, పీడీఎస్‌యూ నేతలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆర్ట్స్ కాలేజీ ఎదుట జార్జిరెడ్డి చిత్రపటానికి పీడీఎస్‌యూ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైద్య శిబిరానికి మంచి స్పందన

వెంగళరావునగర్: వికాస తరంగిణి ఈఎస్‌ఐ శాఖ ఆధ్వర్యంలో బేగంపేట మెడికోవర్ ఆస్పత్రి సహకారంతో శుక్రవారం ఈఎస్‌ఐ సమీపంలోని శ్రీవిజయలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తుల నుంచి మంచి స్పందన లభించింది. ఆలయ పూజారి గట్టు రంగాచారి స్వామి పుట్టిన రోజు సందర్భంగా వైద్య శిబిరాన్ని నిర్వహించామని వైద్యులు, వికాస తరంగిణి ప్రతినిధులు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. వికాస తరంగిణి చైర్మన్ మురళీకృష్ణ, ప్రముఖ సామాజికవేత్త, ఆరోగ్య సంచాలకులు మధుబాబు, ఆలయ కమిటీ కార్యదర్శి జనార్దన్, మేనేజర్ మల్లేష్ తదితరులు వైద్య శిబిరంలో తమ సహాయ సహకారాలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

శ్రీరామ పాదుకా పట్టాభిషేకం హరికథా గానం

నల్లకుంట: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాస, హరికథా కేసరి దివంగత నేతి లక్ష్మీనారాయణ భగవతుల శిష్య బృందం సంయుక్తాధ్వర్యంలో నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో నిర్వహిస్తున్న సంస్మరణ పూర్వక హరికథాగాన మహోత్సవాలు ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం శిఖామణి భాగవతారిణి శ్రీరామ పాదుకా పట్టాభిషేకం హరికథాగానంతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం నృత్య విభాగం అధిపతి డాక్టర్ వనజ హాజరై మాట్లాడారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



భారత్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. పలుచోట్ల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వివిధ కాలనీ సంఘాలు తమ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు.

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, వైద్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని అంబర్ నగర్, పార్సిగుట్ట తదితర ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ కంది శైలజ తదితరులు పాల్గొన్నారు.

- బౌద్ధనగర్‌లో నిర్వహించిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, మాజీ మేయర్ బండకార్తీకరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లింగాని శ్రీనివాస్, ఉదయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

- సికింద్రాబాద్‌లోని చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ఆఫ్ టికెట్ చెకింగ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ ప్రెసిడెంట్ జయరాం నాయక్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్: మెట్టుగూడ కూడలిలో కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆవిష్కరించారు. సీ తాఫల్‌మండి కూడలిలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్ర హం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


సీతాఫల్‌మండిలో డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ


ఆలిండియా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ఆఫ్ టికెట్ చెకింగ్ బ్రాంచ్ అధ్యక్షులు జయరాం నాయక్, సభ్యులు


అంబేద్కర్ జయంతి ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి


మెట్టుగూడలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఆదం సంతోష్‌కుమార్


మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గాంధీ వైద్యులు


కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, మాజీ మేయర్ బందకార్తీక రెడ్డి


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ


వెంగళరావునగర్‌లో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని


బేగంపేటలో..కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


హమాలిబస్తీలో ఆర్థిక సహాయం చేస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత


ఎఫ్‌సీఐ గోదాములో కార్పొరేటర్ కొలను లక్ష్మీ, జి.సూర్యశంకర్‌రెడ్డి, సుబ్బరాజు తదితరులు..


బేగంపేట–బల్కంపేట లింక్‌రోడ్డులో.. కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి..


బల్కంపేటలో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వెల్లాల రామ్మోహన్..


ఈఎస్‌ఐసీలో జరిగిన జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీరాంచందర్‌రావు, అమీర్‌పేట కార్పొరేటర్


బన్సీలాల్‌పేట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన కార్పొరేటర్ కె. హేమలత


అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న ఇఫ్లూ వీసీ ప్రొ.సురేష్‌కుమార్


వినోభానగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం


మాణికేశ్వర్‌నగర్‌లో అంబేద్కర్‌కు నివాళ్లు అర్పిస్తున్న మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి


బల్కంపేటలో అలంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు,మాజీ కార్పొరేటర్

మురుగంతా గుంతలోకే...
దుర్వాసనతో తప్పని ఇబ్బందులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఐడీఎల్ చెరువు కట్ట కింద హబీబ్ నగర్‌కు వెళ్లే దారిలో ఉన్న బస్ పార్కింగ్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఈ ప్రాంతంలో ప్రైవేట్ బస్‌లను రాత్రి పార్కింగ్ చేస్తారు. అక్కడ సెప్టిక్ ట్యాంక్ నిర్మించకుండా ఓపెన్‌గా పెద్ద గుంత తీసి డ్రైనేజీలోకి వదిలేస్తున్నారు. అంతే కాకుండా బట్టలు, గిన్నెలు కడుకున్న నీరు ఇలా ప్రతి ఒక్కటి అందులోకే వదలటంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కనీసం సెప్టిక్ ట్యాంక్ నిర్మించినా లేదా డ్రైనేజీ లైన్‌లోకి కలిసినా ఇంత దుర్గంధం రాకపోవచ్చు. దుర్వాసన ఎంతలా ఉంటుందంటే చుట్టు పక్కల ప్రాంతాలకు సుమారు వంద మీటర్ల వరకు వస్తోంది. పక్కనే ప్రైవేట్ స్పోర్ట్స్ సెంటర్ ఉండటంతో అక్కడికి నిత్యం క్రికెట్, వాలీబాల్, షటిల్ ఆడేందుకు వస్తుంటారు. అక్కడికి తమ ఆరోగ్యం కాపాడుకునేందుకు వస్తే దుర్వాసనతో రోగాల భారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. గ్రౌండ్‌లో కనీసం ఒక్క క్షణం ఉండలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా తమ గోడును పట్టించుకోవటం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఐడీఎల్ చెరువు కట్ట కింద హబీబ్‌నగర్‌కు వెళ్లే దారిలో ఉన్న బస్ పార్కింగ్‌లో దుర్గంధం

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తి ముందస్తు అరెస్టు

బంజారాహిల్స్: ఒక వర్గంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్‌లో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకున్న చింటూ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసే క్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. గతంలో ఎస్ఆర్‌నగర్ పరిధిలో ఒక వర్గాన్ని ఉద్దేశించి చింటు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు పలు సెక్షన్ల కింద ఆయనకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తు అరెస్ట్ చేసినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.


పోలీసుల అదుపులో చింటు

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నిబంధనల విరుద్ధంగా పోలీసుల కళ్లుగప్పి హుక్కా సరఫరా చేస్తున్న కేంద్రంపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా మూడు హుక్కా పాట్స్‌తో పాటు హుక్కా తీసుకుంటున్న అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలంగా శ్రీకృష్ణానగర్‌లో మహ్మద్ అమన్, సాయికృష్ణ అనే ఇద్దరు యువకులు హుక్కా సెంటర్ అడ్డదారుల్లో నడిపిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ హరీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈ సెంటర్‌పై దాడి చేయగా అయిదుగురు హుక్కా పీలుస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి హుక్కా సామగ్రిని సీజ్ చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

21 నుంచి రైస్‌బ్రాన్ ఆయిల్‌పై అంతర్జాతీయ సదస్సు

సనత్‌నగర్: రైస్ బ్రాన్ ఆయిల్‌పై ఈ నెల 21 నుంచి 23 వరకు ఏడో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రైస్ బ్రాన్ ఆయిల్ (ఐఏఆర్‌బీఓ), ద సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) సంయుక్తంగా నగరంలోని మారియట్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నాయి. ఆసమ్ రైస్ బ్రాన్ ఆయిల్ ఫర్ సస్టెయినబుల్ ఎకో సిస్టమ్ (స్థిరమైన పర్యావరణ వ్యవస్థ కోసం అద్భుతమైన రైస్ బ్రాన్ ఆయిల్) థీమ్‌తో ఈ సదస్సు కొనసాగించనున్నట్లు ఎస్ఈఏ ఇండియా అధ్యక్షులు అజయ్‌ఝున్‌ఝువాలా, ఐఏఆర్‌బీఓ సెక్రటరీ జనరల్, ఎస్ఏఈ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీ మెహతాలు ఓ ప్రకటనలో తెలిపారు.

క్రైం కార్నర్..

మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన వేణు

చిలకలగూడ : మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ హరీష్ తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండికి చెందిన అలకపల్లి వేణు (47) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నినెలలగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 13న బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య సంధ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైలుకిందపడి యవకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: అప్పులబాధ తాళలేక రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా జీడిపల్లికి చెందిన ఎర్ర నర్సింగరావు (21) ప్రైవేటు ఉద్యోగి. తాగుడుకు బానిసైన నర్సింగరావు తకను సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లితండ్రుతో గొడవ పడ్డాడు. వారు నిరాకరించడంతో మేడ్చల్–మనోహరాబాద్ రైల్వేస్టేషన్ల మధ్యకు చేరుకుని రైలుకిందపడి ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా శ్రీశక్తి ఎడ్యుకేషన్ సొసైటీ వార్షిక సంబరాలు



అలరించిన విద్యార్థుల నృత్యాలు..



సనత్‌నగర్: బేగంపేటలోని శ్రీశక్తి కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్–శ్రీశక్తి కళాశాలల వార్షిక సంబరాలు అంబరాన్నంటాయి. బేగంపేటలోని ఆయా కళాశాలల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. నృత్యాలతో హోరెత్తించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఏకేఖాన్ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. శ్రీశక్తి గ్రూప్ చైర్మన్ డీవీ మనోహర్ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



ముషీరాబాద్: దంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని గాంధీ ఆసుపత్రి రిటైర్డ్ సర్జన్ డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో డాక్టర్ ఓఎస్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది బాలికలకు ఉచిత దంత పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నోటి శుభ్రత మన ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుందని దంతాలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని సూచించారు. దంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ దేవరాజ్, డాక్టర్ అశోక్, డాక్టర్ కుసుమ బోగరాజు, డాక్టర్ అనిల్ తదితరులున్నారు.

నిత్య జనగణమన

నల్లకుంట: నిత్య జనగణమన కార్యక్రమానికి బీజేపీ అంబర్‌పేట ఎస్సీ మోర్చా కన్వీనర్ శివకుమార్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిత్య జనగణమన నిర్వాహకులు నేలంటి మధు, అతిథులు నల్లవెల్లి విజయేందర్ రెడ్డి, మల్లాది బిక్షపతియాదవ్, మల్లాది క్రాంతి, బందే ప్రజా శ్రీనివాస్, ఉపేంద్ర ప్రసాద్ దూబే తదితరులతో కలిసి శివకుమార్ భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత 300 రోజులకు పైగా రోజూ జాతీయ జెండాను ఎగురవేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరిలో జాతీయతా భావం, దేశ భక్తి పెరుగుతుందన్నారు.


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా అంబర్‌పేట కన్వీనర్ శివకుమార్

16న రాష్ట్రస్థాయి త్రోబాల్ ఎంపిక పోటీలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర త్రో బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లోని బ్లూ బెల్స్ హైస్కూల్‌లో 33వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలురు, బాలికలకు త్రో బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి ఓదెలు యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలో పాల్గొనేవారు ఏప్రిల్ 15, 2004 తర్వాత జన్మించిన వారు అర్హులు. ఎంపికైన జట్టును మే 12 నుంచి 14 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలో పాల్గొంటారని వివరించారు.